


ఆర్‌యూను రాష్ట్ర స్థాయిలో నిలపాలి

● ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్



ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న వర్సిటీ అధికారులు, అధ్యాపకులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యా సంస్థల ర్యాంకింగ్‌లో రాయలసీమ యూనివర్సిటీ రాష్ట్ర స్థాయిలో నిలపాలని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఎస్ విజయభాస్కర్ అన్నారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో వర్సిటీ అధికారులు, అధ్యాపకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఉపకులపతి వి.వెంకట బసవరావు మాట్లాడుతూ విద్యామండలిలో వైస్ చైర్మన్ హోదాలో రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ఎస్ విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి, వర్సిటీని రాష్ట్రంలో ఉన్నత స్థాయిలో నిలపాలని అన్నారు. వివిధ కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం వహించి మంచి వ్యక్తిత్వాన్ని పెంచాలని సూచించారు. ఈ సమీక్షలో రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, నరసింహులు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాలు ఏటేటా పెరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 85 కిలోమీటర్లకు పైగా ఉన్న హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారి మీద నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం జరుగుతూనే ఉంది. ఒకరు ఇద్దరు మరణించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. శుక్రవారం కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలో బైక్‌ను తోసుకుపోయి మంటల్లో ప్రైవేట్ ట్రావెల్ బస్సు కాలిపోయిన ఘటనలో 19 మంది ప్రయాణికులు అగ్నికి ఆహుతైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాల తీరును పరిశీలిస్తే గుండెలు పగిలే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆ వివరాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ప్రమాదాల రహదారులు



- జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- రక్తసిక్తమవుతున్న జాతీయ రహదారి
- కనీస భద్రతా చర్యలు పాటించకపోవడమే కారణమా..?
- అనుభవం లేని డ్రైవర్లతో ట్రావెల్ బస్సులు నడిపిస్తున్న యాజమాన్యం

కర్నూలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారులు, స్టేట్ హైవే రహదారుల్లో ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు, పోలీసులు హడావుడి చేస్తున్నారు. తరువాత షరా మామూలే అని వదిలేస్తున్నారు. ఏటేటా భద్రతా వారోత్సవాలు నిర్వహించినా ప్రమాదాలు తగ్గడం లేదు. పైగా పెరుగుతూనే ఉన్నాయి. రవాణా శాఖ అధికారుల్లో అలసత్వం, సిబ్బంది కొరత, పోలీసులు శాంతి భద్రత పర్యవేక్షణకే పరిమితం కావడం వంటి సమస్యలు ఉన్నాయి. ప్రమాదాల నివారణ ప్రకటనలకే పరిమితమైంది. దీనికి తోడు అనుభవం లేని డ్రైవర్ల వల్ల ప్రజల ప్రాణాలు పణంగా పెట్టాల్సి వస్తున్నది. దేశవ్యాప్తంగా మానవ తప్పిదాల వల్లే 95 శాతం ప్రమాదాలు జరిగితే, డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల 75 శాతం, మరో 25 శాతం రోడ్లు, వాహనాల మరమ్మతుల కారణంగా జరుగుతున్నట్లు సమాచారం. జిల్లాలో 600-800 మందికి పైగా మృత్యువాత పడితే, 3 వేల మందికిపైగా గాయాల పాలవుతున్నారు.



2019 మే 11న వెల్దుర్తి సమీపంలో జరిగిన ప్రమాదం

జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదాలు కొన్ని

- ఈ ఏడాది మే 20న ప్యాపిలి సమీపంలో జాతీయ రహదారి-44పై జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటకకు చెందిన ముగ్గురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు
- 2019 మే 11న వెల్దుర్తి సమీపంలో చెక్‌పోస్టు వద్ద తుఫాన్ జీపును ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో 16 మంది మృతి చెందారు. మృతులంతా తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లె మండలం రామాపురం గ్రామానికి చెందినవారు.
- 2021 ఫిబ్రవరి 15న మాదార్‌పురం గ్రామం వద్ద మినీ బస్‌ను లారీ ఢీకొన్న ఘటనలో 14 మంది మృతి చెందారు. వెల్దుర్తి సర్కిల్‌లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకరు ఇద్దరు మృతి చెందిన సంఘటనలు అనేకం ఉన్నాయి.
- 2019-21 మధ్య కాలంలో వెల్దుర్తి-మాదార్‌పురం మధ్య పలు ప్రమాదాలు జరిగాయి. మాదార్‌పురం సమీపంలో ఓ వాహనం బోల్తాపడి పలువురు మృత్యువాత పడ్డారు.
- కర్నూలు-చిత్తూరు వయా నంద్యాల, ఆళ్లగడ్డ జాతీయ రహదారిలో ఆళ్లగడ్డ, చాగలమర్రి మధ్య నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అతివేగమే ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలుస్తోంది.

ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలు

హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి-44పై కర్నూలు నగరం సంతోష్ నగర్, చిన్నటేకూరు, ఉల్లిందకొండ క్రాస్, దత్తాత్రేయస్వామి ఆలయం సమీపంలో, వెల్దుర్తి సర్కిల్ ఆంజనేయస్వామి విగ్రహం, మదార్‌పురం, ప్యాపిలి క్రాస్ రోడ్డు.. వంటి ప్రాంతాలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. తాజాగా కర్నూలు నగర శివారులో వెంకన్నబావి ప్రాంతం కూడా ప్రమాదకరంగా మారింది.

పోలీసుల దర్యాప్తు వేగవంతం

కర్నూలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సమీపంలోని చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాద ఘటనపై పోలీసులు వేగవంతమైన దర్యాప్తు చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఈ కేసును సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. శనివారం దర్యాప్తులో కీలక ఆధారాలను సేకరించారు. బైక్ నడిపిన శివ శంకర్ గురించి ఆరా తీశారు. ఆ యువకుడు ఎక్కడి నుంచి బయల్దేరాడు? ఎక్కడకు వెళ్తున్నాడు? వంటి విషయాలపై క్షుణ్ణంగా ఆరా తీశారు. తుగ్గలి మండలం రాంపల్లె గ్రామానికి చెందిన ఎర్రిస్వామిని డోన్‌లో వదిలిపెట్టేందుకు శివశంకర్ అర్ధరాత్రి బయల్దేరాడు. వీరు పల్సర్ బైక్‌కు చిన్న టేకూరు వద్ద ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంకులో పెట్రోల్ పట్టించుకున్నారు. అక్కడ బైక్‌పై విన్యాసం చేశారు. వర్షం పడుతుంటంతో వీరి బైక్ హరంగార్ డాబా దాటిన తర్వాత ప్రమాద స్థలానికి 200 మీటర్ల దూరంలో అదుపు తప్పింది. కుడి వైపు ఉన్న డివైడర్‌ను ఢీకొట్టి ఇద్దరు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో శివశంకర్ మృతి చెందగా.. ఎర్రిస్వామికి స్వల్ప గాయాలయ్యాయి. శివశంకర్ ఉలుకు పలుకు లేకుండా పడి రోడ్డుపై ఉండటంతో అతన్ని పక్కకు లాగాడు.

మిగతా 7వ పేజీలో

హంద్రీకి నీటి విడుదల

● జీడీపీ నుంచి దిగువకు 3,300 క్యూసెక్కులు



నీటిని విడుదల చేసిన దృశ్యం

గోనెగండ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ) నుంచి శనివారం ఉదయం హంద్రీ నదికి నీటిని విడుదల చేశారు. జీడీపీ 4, 5 గేట్లు ఎత్తి 3,300 క్యూసెక్కులు హంద్రీకి విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. శుక్రవారం సాయంత్రం నుంచి మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. జీడీపీకి వరద వచ్చి చేరుతోంది. తుంగభద్ర దిగువ కాలువ ద్వారా ప్రాజెక్టులోకి 190 క్యూసెక్కుల నీటిని ఎల్లెల్సీ అధికారుల విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 4 టీఎంసీలు(376.70 మీటర్లు) ఉంది. జీడీపీ పూర్తిస్థాయి నీటిమట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 0.30మీటర్లు మాత్ర మే తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి నుంచి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటిని ఎప్పటికప్పుడు దిగువకు విడుదల చేస్తామన్నారు. రబీ సీజన్‌లో ఆయకట్టుకు నీటి ఇబ్బంది ఉండదని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో శనివారం నుంచే అధికారులు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఐరన్‌బండ, ఎన్నెకండ్ల, గోనెగండ్ల, గంజహళ్లి, నెరుడుప్పల గ్రామాలకు చెందిన రైతుల పొలాల్లో వరద చేరింది. దాదాపు 150 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.

లెదర్ సొసైటీ అవకతవకలపై విచారణ

ఎమ్మెల్యేకు, ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం



లెదర్ సొసైటీని పరిశీలిస్తున్న డీఐసీ జనరల్ మేనేజర్ అశోక్ కుమార్, పరిశ్రమల అధికారి డానియేలు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని లెదర్ సొసైటీ(చర్మ పరిశ్రమ)లో జరుగుతున్న అవినీతిపై అధికారులు విచారణ చేపట్టారు. శనివారం ఈ సొసైటీని డీఐసీ జనరల్ మేనేజర్ అశోకకుమార్, పరిశ్రమల అధికారి డానియేలు తనిఖీలు చేపట్టారు. ఈనెల 18వ తేదీన ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి లెదర్ సొసైటీని పరిశీలించారు. అందులో అవకతవకలు జరుగుతున్నాయని, షేర్ హోల్డర్స్ నష్టపోతున్నారని విచారణకు ఆదేశించారు. ఈ మేరకు విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. సొసైటీని పరిశీలించగా రా మెటీరియల్, మిషన్స్, స్టాక్ ఉందన్నారు. ఈ విచారణకు సంబంధించిన నివేదికను ఎమ్మెల్యే, ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు. మల్లెల గ్రూప్ అధినేత డాక్టర్ మల్లెల అల్ఫ్రెడ్ రాజు, జై భీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముత్తు సుమాల, సామేలుల మాట్లాడుతూ సొసైటీ అన్యాక్రాంతం అవుతుందని, షేర్ హోల్డర్స్‌ని మోసం చేస్తున్నారని, ఈనెల 14న ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్లామన్నారు. స్పందించిన ఆయన విచారణకు ఆదేశించారన్నారు. కార్యక్రమంలో ఉసేని, రంగన్న, సురేష్ సుమాల, షేర్ హోల్డర్స్ పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోళ్లు వాయిదా

సాంకేతిక సమస్యతోనే..: మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందు



ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సీసీఐ పత్తి కొనుగోలు ఈనెల 27న ప్రారంభించాల్సి ఉండగా సాంకేతిక సమస్యతో వాయిదా పడిందని మార్కెట్ యార్డ్ కార్యదర్శి గోవిందు తెలిపారు. శనివారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరతో రైతుల నుంచి పత్తి దిగుబడులకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చిందన్నారు. కిసాన్ కపాస్ యాప్, క్రాప్ బుకింగ్ గ్రామ రైతు సేవ కేంద్రాలలో సర్వర్ సమస్య వల్ల కొనుగోళ్ల రెండు రోజులు పాటు వాయిదా వేస్తున్నాట్లు సీసీఐ ప్రతినిధులు తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని తదుపరి తేదీ ప్రకటిస్తామని తెలిపారు.

ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉంచాలి

● విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రదీప్‌కుమార్



కల్లూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేసేందుకు ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉంచాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రదీప్‌కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని డివిజన్ల పరిధిలో తుఫాను కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల పర్యవేక్షణకు జిల్లా, డివిజన్ల స్థాయిలో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా వర్షాలు, గాలులు ఎక్కువ వీస్తున్న, నీటి నిలువ ఎక్కువ ఉన్నచోట కరెంట్ స్తంభాలను తాకరాదన్నారు. విద్యుత్ సమస్యలకు టోల్ ఫ్రీ నెంబరు 1912 లేక 18004251555333కి ఫోన్ చేయాలన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం



తుమ్మిగనూరులో భారీ వర్షానికి నేలకొరిగిన వరి పైరు

- వరి రైతును నిండా ముంచిన వరుణుడు
- తుమ్మిగనూరు, వాతనూరు గ్రామాల్లో నేలకొరిగిన వంద ఎకరాల వరి

కోసిగి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి వరి రైతులకు అపార నష్టం జరిగింది. వరి రైతులను వరుణ దేవుడు నిండా ముంచేశాడు. మండలంలోని తుమ్మిగనూరు, సాతనూరులో వంద ఎకరాల్లో వరి పైరు నేలకొరిగింది. శుక్రవారం రాత్రి కురిసిన గాలి, వానకు చేతికొచ్చిన వరి పైరు పూర్తిగా నీటిలో పడిపోవడంతో వరి రైతులు గుండెలు బాదుకుంటున్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి మరో వారం రోజుల్లో పంట చేతికొచ్చే సమయానికి వరి పంట నీట మునగడంతో ఆవేదన చెందుతున్నారు. మండల వ్యవసాయధికారి తుమ్మిగనూరు, సాతనూరు గ్రామాల్లో పర్యటించి నేలకొరిగిన పంటను పరిశీలించారు. నీట మునిగిన వరి పైరును ప్రాథమిక నివేదిక ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి, ఉల్లి, మిరప రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా వరి పైరు మరో వారం రోజుల్లో చేతికొస్తుందన్న సమయంలో అకాల వర్షానికి నీట మునగడంతో వరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● కలెక్టర్ ఏ. సిరి



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఏ. సిరి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో తుఫాన్ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 27వ తేదీ నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. చెరువులకు గుండ్లు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల భవనాలు శిథిలావస్థకు చేరినట్లయితే వెంటనే అద్దె భవనంలోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూళ్ల తనిఖీచేయని సచివాలయ సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. మత్స్యకారులు చేపల వేటకెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

శ్రీబాగ్‌పై తేల్చుకుందాం

● రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి

7

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

● ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఘటన

అధికారం లేని పదవులు ఎందుకు..?

● వైసీపీ పాలనలో మార్కెట్ కమిటీలన్నీ నిర్వీర్యం

● ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీల చైర్మన్లు



సమావేశమైన ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీల చైర్మన్లు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అధికారం లేని పదవులు తమకు ఎందుకుని, గత వైసీపీ ప్రభుత్వంలో మార్కెట్ కమిటీల చైర్మన్లకు ఉన్న అధికారాలన్నీ తొలగించారని ఉమ్మడి జిల్లాకు చెందిన మార్కెట్ కమిటీల చైర్మన్లు అన్నారు. శనివారం ఉమ్మడి జిల్లాలోని 15 మార్కెట్ కమిటీల చైర్మన్లు కర్నూలు మార్కెట్ యార్డులో సమావేశమై మాట్లాడారు. తమకు గతంలో టీడీపీ హయాంలో కొనసాగించిన అధికారాలు ఇవ్వాలని, నిర్వీర్యమైన మార్కెట్ కమిటీ యార్డుల పునరుజ్జీవనం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు మొర పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వంలో మార్కెట్ కమిటీల చైర్మన్లకు ఇవ్వాల్సిన అధికారాలు, రైతులకు కల్పించాల్సిన ప్రయోజనాలు, వసతుల గురించి సమావేశంలో చర్చించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత లింక్ రోడ్లపై మార్కెట్ కమిటీల పాలక మండలికి అధికారాలు కల్పించాలని చైర్మన్లు రైతులకు, ప్రజలకు కూటమి ప్రభుత్వంలో రైతుల కోసం అమలు చేస్తున్న ప్రయోజనాలు, పథకాలు, కార్యక్రమాల గురించి అందరికీ తెలియాలంటే మార్కెట్ కమిటీల పాలకవర్గాల పదవీ కాలం కేవలం ఒక సంవత్సరంతో సరిపుచ్చకుండా మూడు సంవత్సరాలకు పొడిగించాలని ముఖ్యమంత్రికి పంపిన వినతి పత్రంలో పేర్కొన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీల చైర్మన్లకు చెక్‌పవర్ ఇచ్చారనీ, వైసీపీ పాలనలో ఆ అధికారాన్ని రద్దు చేయడం వల్ల కేవలం చైర్మన్లు అలంకార ప్రాయంగా తయారయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో మార్కెట్ కమిటీల చైర్మన్లకు నెలకు రూ.30వేల వేతనం అందిస్తున్నారని, అదే మొత్తాన్ని ఏపీలో కూడా అందించాలని ప్రముఖ దేవాలయాల్లో ప్రొటోకాల్ కల్పించి గౌరవాన్ని అందించాలని మొర పెట్టుకున్నారు. సమావేశంలో కర్నూలు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ గోల్కొండ అబ్జిత్‌బీ, పాణ్యం మార్కెట్ ఛైర్‌పర్సన్ గీతా, సుజాతమ్మ, హరిబాబు, నబీ రసూల్, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల తొలగింపు



వీవర్స్‌కాలనీ గ్రౌండ్‌లో ఉన్న దుకాణాలను తొలగించిన దృశ్యం

- వీవర్స్ కాలనీ మైదానంలో చర్యలు
- వేకువజామున తొలగించిన మున్సిపల్ అధికారులు
- హైకోర్టు ఆదేశాలతోనే..: మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరు,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గత కొంతకాలంగా వివాదాస్పదంగా మారిన వీవర్స్ కాలనీ మైదానంలోని కూరగాయల దుకాణాలను ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు శనివారం తెల్లవారు జామున తొలగించారు. 4.30గంటల సమయంలో ఎక్స్‌కవేటర్ సాయంతో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య కూరగాయల దుకాణాలను తొలగించారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండ దుకాణాలను ఎలా తొలగిస్తారని వ్యాపారులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో తాత్కాలికంగా ఈ కూరగాయల దుకాణాలను మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేయించారు. ఆ తర్వాత తొలగించకపోవడంతో అప్పటి నుంచి ఈ వివాదం నడుస్తోంది. క్రీడా మైదానంలో కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సైతం ఈ దుకాణాల ఏర్పాటుపై నిరసన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు దుణాలపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడంతో పట్టణ ప్రజలు, క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా తాము రూ.25వేల అడ్వాన్స్‌తో పాటు నెలకు రూ.4వేల అద్దెను వైడబ్ల్యూసీఎస్‌కు చెల్లిస్తున్నామని, మున్సిపల్ అధికారులు, వైడబ్ల్యూసీఎస్ అధికారులు సమాచారం ఇవ్వకుండా దుకాణాలను తొలగించడంతో తాము నష్టపోయామని బాధితులు ఆవేదన చెందారు.

హైకోర్టు ఆదేశాలతో

వీవర్స్ కాలనీ మైదానంలో అన్యాక్రాంతంగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను హైకోర్టు, ప్రభుత్వ ఆదేశాలతో మున్సిపల్ సిబ్బందితో తొలగించాం. ఇది మున్సిపాల్టీ స్థలం కాబట్టి తొలగించాం. ఎవరికైనా వేరే ఆధారాలు ఉంటే కోర్టుకు వెళ్లవచ్చు.

● గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్



గ్రౌండ్‌లో ఉన్న టీ స్టాల్‌ను మినీ ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

శ్రీబాగ్‌పై తేల్చుకుందాం

● 16న కర్నూలులో సభను విజయవంతం చేయండి

● రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి



పత్రాలను ఆవిష్కరిస్తున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

చాగలమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తరతరాలుగా పాలకుల వివక్షత వల్ల తీవ్ర అన్యాయానికి గురవుతున్న రాయలసీమ అభివృద్ధికి శ్రీబాగ్ ఒప్పందంపై తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని రాయల్ కేఫ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన రాయలసీమ హక్కుల సాధన, అభివృద్ధి చర్చావేదిక సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ఈ విషయంపై నవంబరు 16న కర్నూలు పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. సమితి సభ్యులు రామాంజనేయులు, ఖాసీం, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పాత రైల్వే వంతెన గోడను ఢీ కొట్టిన లారీ

● ప్రమాదంలో డ్రైవర్ మృతి ● నల్లమలలో ట్రాఫిక్‌కు అంతరాయం

మహానంది, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న లోడ్‌తో రాజమండ్రికి వెళ్తున్న లారీ శనివారం ఉదయం నంద్యాల- గిద్దలూరు ప్రధాన రహదారిలోని పాత రైల్వే వంతెన గోడను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ బాల ఉసేని అక్కడికక్కడే మృతి చెందాడు. క్లీనర్ చిన్నయ్యకు స్వల్పంగా గాయాలయ్యాయి. నల్లమలలోని దిగువమెట్ట సమీపంలో ఉన్న పాత రైల్వే వంతెనకు ఉన్న గోడను ప్రమాదవశాత్తు లారీ ఢీ కొట్టి రహదారికి అడ్డంగా నిలిచిపోవడంతో ఇరువైపులా వాహనాలు రెండు కిలో మీటర్ల మేర నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాలను క్రమబద్ధీకరించారు. నల్లమలలో రెండు గంటల పైగానే వాహనాలు నిలిచి పోవడంతో అటువైపు వెళ్ళే ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

చిన్నటేకూరు ఘటన కలచివేసింది

కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



కర్నూలు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు జాతీయ రహదారిపై జరిగిన బస్సు ప్రమాద ఘటన కలచివేసిందని, బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కల్లూరు మండలం చిన్నటేకూరు సమీపంలో ప్రైవేట్ బస్సు అగ్నికి ఆహుతై 19 మంది సజీవ దహనం అయ్యారు. ఈ క్రమంలో ఆయన శనివారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. బస్సు ప్రమాదం జరిగిన రోజు తాను సంఘటనా స్థలంలో వెళ్లానని, ఆ ప్రాంతం భీతావహంగా మారిందన్నారు. బైక్ నడిపిన యువకుడితో పాటు మొత్తం 20 మంది మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. డీఎన్ఏ రిపోర్టు రాగానే కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించేలా ఏర్పాట్లు చేశామన్నారు.

బస్సు ప్రమాద బాధితులకు న్యాయ సహాయం

● జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో బాధితులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ బస్సు ప్రమాదంలో 19 మంది ప్రాణాలు కోల్పోవడమే కాక.. పలువురు క్షతగాత్రులయ్యారని, వారికి ఉచిత న్యాయ సహాయం అందించడానికి న్యాయ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక న్యాయ సేవా సదన్ భవనంలో ఈ మేరకు ఆయన న్యాయ సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. బాదితులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను గానీ, టోల్ ఫ్రీ నెంబర్‌ను గానీ 15100కు గానీ ఫోన్ చేసి వారి సమస్యలను తెలుపుకోవచ్చని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

నంద్యాల టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన నంద్యాల పట్టణ శివారులో శనివారం చోటు చేసుకున్నది. ట్రాఫిక్ పోలీసుల వివరాల ప్రకారం.. శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామానికి చెందిన భారతి(31) భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై నంద్యాల వస్తుండుగా కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన భారతిని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందారు. భర్త రవికుమార్‌కు తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

● ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి ఘటన



పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

ఆదోని రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం ఇస్వీ బ్రిడ్జి సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి పొలాల్లో దూసుకెళ్లింది. శనివారం ఆర్టీసి డిపో నుంచి విద్యార్థుల కోసం బస్సు మాధవరానికి బయల్దేరింది. ఇస్వీ బ్రిడ్జి వద్ద రాగానే ఎదురుగా వేగంగా దిచక్ర వాహనదారుడు బస్సు మీదకు రావడంతో దానిని తప్పించబోయే క్రమంలో బస్సు ఒక్కసారిగా పొలాల్లోకి దూసుకెళ్లి ఒరిగిపోయింది. అయితే ఈ సంఘటన స్థలంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ రాజు, కండెక్టర్‌కు సురక్షితంగా బయటపడ్డారు. ఇస్వీ పోలీసులు విచారణ చేపట్టారు.

నీటి కుంటలో పడి యువకుడు మృతి

చాగలమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన యువకుడు దూదెకుల ధర్మతేజ (15) ప్రమాదవశాత్తు నీటి కుంటలో జారిపడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన బాలదస్తగిరి, సిద్ధేశ్వరిలకు ముగ్గురు సంతానం. మూడో కుమారుడైన ధర్మతేజ గ్రామ పొలిమేరలో పశువులను మేపుకునేందుకు వెళ్లాడు. అక్కడ తోటి స్నేహితులతో ఆడుకుంటూ సమీపంలో ఉన్న నీటి కుంటలో కాలుజారి పడిపోయాడు. అక్కడే ఉన్న స్నేహితులు ఇంటికి వెళ్లి వారి కుటుంబీకులకు తెలపడంతో స్థానికులు, కుటుంబీకులు కలిసి నీటి కుంట వద్దకు వెళ్లి ధర్మతేజను బయటకు తీశారు. చికిత్స నిమిత్తం చాగలమర్రి కేరళ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సురేష్, పోలీసులు వైద్యశాలకు చేరుకొని యువకుడి మృతి విషయం గురించి కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదే వాన.. తగ్గని వరద

● ఉధృతంగా కుందూ, వక్కిలేరు
● కుళ్లిన మొక్కజొన్న, మినుము, బెండ
● స్తంభించిన రాకపోకలు
● పట్టించుకోని వ్యవసాయశాఖ



బ్రాహ్మణపల్లె వక్కిలేరు వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

చాగలమర్రి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలోని వాయుగుండ ప్రభావంతో వర్షాలు ఆగకుండా కురుస్తున్నాయి. చాగలమర్రి మండలంలో శనివారం తెల్లవారుజామున కుండపోత వర్షం కురిసింది. 14.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కుందూ, వక్కిలేరు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షంతో రైతులు రహదారిపై ఆరబోసిన మొక్కజొన్న మళ్లీ తడిసి మొలకలు వచ్చాయి. కలుగొట్లపల్లె, బ్రాహ్మణపల్లె వక్కిలేరు వంతెనలపై వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. నేలంపాడు, గొట్లూరు, రాంపల్లె తదితర గ్రామాల్లో పంట పొలాలు దెబ్బతినింది. పంట పొలాల్లో ప్రవహించిన వరద నీరు తగ్గకపోవడంతో మొక్కజొన్న, మినుము, బెండ, జూట్, ఉల్లి గడ్డలు కుళ్లిపోయాయి. ఈ వర్షాలకు మండలంలోని నేలంపాడు గ్రామంలో 2 మట్టిమిద్దెలు కుప్పకూలాయి.

ప్యాపిలిని ముంచెత్తిన వర్షం

పొంగి పొర్లిన వాగులు, వంకలు

ప్యాపిలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్యాపిలి మండలంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మాధవరం, అలేబాదు, మునిమడుగు, రాచెర్ల, గార్లదిన్నె గ్రామాల్లో వర్షం ముంచెత్తింది. గార్లదిన్నె గ్రామంలో భారీ వర్షానికి వాగు ఉప్పొంగడంతో మునిమడుగుకు వెళ్లే రహదారిపై మోకాళ్ల లోతు వరకు నీరు ప్రవహించింది. దీంతో రోడ్డుపై వాహనాల రాకపోకలు రెండు గంటల పాటు నిలిచి పోయాయి. వర్షానికి రాచెర్ల గ్రామంలో వందలాది ఎకరాల్లోని సజ్జ పంట తడిసిముద్దయింది.



ప్యాపిలి మండలంలోని గార్లదిన్నె గ్రామం వద్ద రోడ్డుపై ఉగ్రరూపం దాల్చిన నీటి ప్రవాహం

ఉమ్మడి జిల్లాకు రూ.2 కోట్లు

● తక్షణ సహాయ చర్యలకు నిధులు విడుదల

నంద్యాల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.14కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే నిధులను డ్రా చేసి అవసరమైన ప్రాంతాల్లో ప్రజలకు ఆహారం, తాగునీరు, వైద్యం తదితర సంరక్షణ చర్యలు చేపట్టాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇందులో భాగంగా కర్నూలు, నంద్యాల జిల్లాలకు రూ.కోటి చొప్పున రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసింది.

కోవెలకుంట్లలో భారీ వర్షం



భీమునిపాడు ఎస్సీ కాలనీలో నీట మునిగిన ఇల్లు

కోవెలకుంట్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల మండలంలో శుక్రవారం రాత్రి 76.6 మిమీల వర్షం కురిసింది. భీమునిపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలు జలమయమయ్యాయి. గుళ్లదుర్తి గ్రామంలో వంద ఎకరాల్లో వరి పైరు నీట మునిగింది. పొట్టిపాడు వెళ్లే ఆర్అండ్‌బి రహదారిలో ఊరి ముందు ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని అమడాల, బిజినవేముల, గోవిందిన్నె, చిన్నకొప్పెర్ల, వల్లంపాడు, లింగాల తదితర గ్రామాల మీదుగా ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కోవెలకుంట్ల నుండి వల్లంపాడు, లింగాల మీదుగా నంద్యాలకు వెళ్లే ప్రధాన రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి.

అన్నదాతలకు అపార నష్టం

కొలిమిగుండ్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం అన్నదాతలకు అపార నష్టాన్ని మిగిల్చింది. భారీ వర్షాల కారణంగా కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. ప్రధానంగా మండలంలోని కల్వటాల, నందిపాడు, కొలిమిగుండ్ల, బెలుంశింగవరం, తిమ్మనాయినిపేట, కోటపాడు తదితర గ్రామాల్లో నూర్పిడి చేసిన మొక్కజొన్న వర్షంలో తడిచిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా రైతులు 1,300 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా, సుమారు 500 ఎకరాల్లో సాగు చేసిన పంటను నూర్పిడి చేశారు. భారీ వర్షాలతో నూర్పిడి చేసిన మొక్కజొన్న దిగుబడి పూర్తిగా నీటిలో తడిచిపోయింది. నాలుగు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో కప్పి ఉంచిన పట్టలకిందే మొక్కజొన్న మొలకెత్తే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొలకెత్తిన మొక్కజొన్నను కొనడానికి ఎవరూ ముందుకు రారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు 25 క్వింటాళ్లకు పైబడి దిగుబడి వచ్చిందనుకున్న రైతులకు భారీ వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి. ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. మరోవైపు కంది, మినుము, అరకొరగా సాగుచేసిన పప్పు శనగ పంటల్లో నీరు చేరడంతో పంటలు కుళ్లిపోయే పరిస్థితి నెలకొందని అన్నదాతలు వాపోతున్నారు.



బెలుంశింగవరం వద్ద తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

బస్సుకు అనుమతులు ఉన్నాయి

● రాయ్‌ఘడ్ ఆర్‌టీఏకు అధికారుల లేఖ



కర్నూలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రమాదానికి కారణమైన బస్సుకు అన్ని అనుమతులన్నీ ఉన్నాయి. ఒడిషా రాష్ట్రం రాయ్‌ఘడ్ జిల్లా చెందిన వేమూరి కావేరి ట్రావెల్స్ అనే బస్సును వేమూరి వినోద్‌కుమార్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడు. ఈ బస్సుకు 2018 ఆగస్టు 8వ తేదీన రిజిస్ట్రేషన్ జరిగింది. మొదట ఈబస్సు తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ ఆర్‌టీఏ పరిధిలో (టీఎస్-08యుఎఫ్2342) అను నెంబరుతో రిజిస్ట్రేషన్ అయింది. ఆతర్వాత ఈబస్సుకు 2023 మార్చి 31న ఎన్‌వోసీ ఇచ్చారు. ఈబస్సు ఉత్తరాం చల్ (డామన్ డయ్యూ) దాద్రా నగర్ హవేలీ అనే కేంద్ర పాలిత రాష్ట్రానికి మైగ్రేషన్ (రిజిస్ట్రేషన్ నెంబర్. డీడీ01ఎన్9490) అయింది. ఆ తర్వాత 2025 ఏప్రిల్ 29న ఒడిషా రాష్ట్రం రాయ్‌ఘడ్ ఆర్‌టీఏ రిజిస్ట్రేషన్‌కు మైగ్రేషన్ అయింది. ప్రస్తుతం వేమూరి కావేరి ట్రావెల్స్ మీద బస్సు తిరుగుతుంది. మే 1, 2025న ఈ బస్సుకు పర్మిట్ తీసుకున్నారు. 2030వరకు పర్మిట్ అనుమతులున్నాయి. 2026 ఏప్రిల్ 20 వరకు ఇన్సూరెన్స్, 2027 మార్చి 31వరకు ఫిట్‌నెస్ అనుమతి ఉంది. 2026 మార్చి 31వరకు కూడా ట్యాక్స్ కట్టేశా రు. బస్సు కెపాసిటీ- 43 (స్లీపర్). ఈ బస్సుకు ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు.

ఒక చిన్న నిర్లక్ష్యమే..

బస్సుకు ఎన్ని అనుమతులున్నా.. అనుభవం ఉన్న డ్రైవర్లున్నా.. ఒక చిన్న నిర్లక్ష్యం 19 మంది ప్రాణాలు బలికొంది. బైక్‌ను ఢీకొన్న తర్వాత సుమారు 170 మీటర్లమేర (500 అడుగులు) లాక్కెళ్లింది. ఈ 500 మీటర్లలో డ్రైవర్ బ్రేక్ వేసినా కూడా బస్సు ఆగేది. బస్సు ఆపి పరిశీలిస్తే ప్రమాదం జరిగి ఉండేది కాదు. మరో వైపు మంటలు ఆర్పే ప్రయత్నం చేయకుండా ప్రయాణికులను అప్రమత్తం చేసి ఉంటే ఈ ప్రమాదం తప్పి ఉండేదని పలువురి వాదనలు వినిపిస్తున్నాయి.

అధికారికంగా అనుమతులు తీసుకున్నారా?

2018లో బస్సు రిజిస్ట్రేషన్ జరిగిన తర్వాత అది 53సీటర్ కెపాసిటీతో చాసిస్ రూపొందించుకుని అనుమతులు తీసుకుంది. ఆ తర్వాత డామన్ డయ్‌లో రిజిస్ట్రేషన్ జరిగింది. అక్కడి నుంచి రాయ్‌ఘడ్ ఆర్‌టీఏకు మైగ్రేషన్ కావడం ఆ తర్వాత బస్సు రూపం మారింది. 43సీపర్‌గా మారి అనుమతులు తీసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఆ అనుమతులు ఎలా ఇచ్చారు? అధికారికంగా అనుమతులు తీసుకున్నారా? ఆ 43 సీపర్‌కే పన్నులు చెల్లిస్తున్నారనే విషయాలపై ఆర్‌టీఏ అధికారులకు రవాణ అధికారులు లేఖ రాసినట్లు తెలిసింది.

ట్రావెల్ బస్సులపై ఆర్‌టీఏ దాడులు

కర్నూలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన బస్సు ప్రమాదం దృష్ట్యా రవాణా శాఖ అధికారులు ముమ్మరంగా దాడులు చేశారు. కర్నూలు డీటీసీ శాంతకుమారి ఆధ్వర్యంలో ఎంవీఐలు, ఏఎంవీఐలు శుక్రవారం రాత్రి పలు చోట్ల తనిఖీలు చేశారు. మొత్తం 12 కేసులు నమోదు చేశారు. వీటిలో ఎలాంటి రికార్డులు లేకుండా వెళ్తున్న 2 బస్సులను అగ్నిమాపక సహాయక పరికరాలు లేకుండా ఉన్న 7 బస్సులు, ఎమర్జెన్సీ అలారం లేకుండా ఉన్న బస్సుపై ఒక కేసు నమోదు చేశారు. అలాగే మరో బస్సుకు ఎమర్జెన్సీ డోర్ లేకపోవడాన్ని గుర్తించారు. మరో బస్సు ఎలాంటి పర్మిట్ లేకుండానే ట్రావెల్స్ చేస్తున్నట్లు గుర్తించి జరిమానా విధించారు. అలాగే వర్షం పడితే తుడిచే విండ్ సీల్డ్ లేకుండా ఉన్న రెండు బస్సులను గుర్తించి జరిమానా వేశారు. మొత్తం రూ.2.48 లక్షలు జరిమానా విధించినట్లు డీటీసీ వెల్లడించారు.

పోలీసుల దర్యాప్తు వేగవంతం

(5వ పేజీ తరువాయి)

అంతలో బైక్ తీసేందుకు ప్రయత్నించగా.. రెండు, మూడు బస్సులు అటువైపుగా వెళ్లాయి. ఇంకోసారి బైక్ తీసే ప్రయత్నంలో ఉండగా.. వేమూరి ట్రావెల్స్ బస్సు వచ్చి ఈ బైక్‌ను ఢీకొట్టి తోసుకుంటూ వెళ్లిపోయింది. ఇలా తోసుకుంటూ వెళ్లడమే ప్రమాదానికి కారణమని పోలీసులు గుర్తించారు. ఈ సమయంలో అటువైపుగా వెళ్లిన రెండు ఆర్టీసీ, ఒక ట్రావెల్ బస్సులను రిజిస్ట్రేషన్ల ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఆ బస్సు డ్రైవర్లను ఆదివారం కర్నూలుకు పిలిపించి పోలీసులు స్టేట్‌మెంట్లు తీసుకోనున్నారు.

బాధితులకు మెరుగైన సేవలు

● ఆర్ఐసీయూలో ప్రయాణికుడు గుణసాయికి చికిత్స

● 11 మంది జీజీహెచ్ నుంచి డిశ్చార్జ్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు సమీపంలో బస్సు దగ్ధం సంఘటనలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు వైద్యులను ఆదేశించారు. శనివారం రాత్రి ఆయన కర్నూలు జీజీహెచ్‌లోని క్యాజువాల్టీ, ఏఎంసీ అత్యవసర విభాగాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న బస్సు ప్రమాద బాధితుడు తూర్పుగోదావరిజిల్లాకు చెందిన గుణసాయి కుమార్ (27) ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐసీయులో చికిత్స పొందుతున్న బాదితుని బీపీ, పల్స్‌రేట్ ఆక్సిజన్ శాతం ఎలా ఉందో వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి 3 గంటలకు ఒక్కసారి రోగి బీపీ, పల్స్ ఆక్సిజన్ శాచులేషన్‌ను నివేధిక పంపించాలని పల్మనాలజీ జనరల్ మెడిసిన్, అనస్థీషియా డ్యూటీ డాక్టర్లను ఆదేశించారు. బస్సు ప్రమాదంలో గాయపడి 12 మంది హాస్పిటల్‌కు వచ్చి చికిత్స తీసుకుని 11 మంది డిశ్చార్జ్ అయినట్లు తెలిపారు.

ఎర్రిస్వామికి చికిత్స

కర్నూలు బస్సు ప్రమాదం బైకిస్టు శివశంకర్ మిత్రుడు ఎర్రిస్వామిని చికిత్స కోసం పోలీసులు కర్నూలు జీజీహెచ్‌కు శనివారం రాత్రి తీసుకుని వచ్చారు. ఎర్రిస్వామికి కడుపు నొప్పి ఉండటంతో అతనికి స్కానింగ్, ఇతర పరీక్షలు చేయించారు. తక్షణమే ఎర్రిస్వామిని సర్జరీ వార్డులో అడ్మిట్ చేసి చికిత్స అందించాలని హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు వైద్యులను ఆదేశించారు.

మెడికల్ పీజీ విద్యార్థిని ఆత్మహత్య

కర్నూలు క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెంకటాద్రి నగర్‌లో భూమిరెడ్డి గిరిజ (26) అనే యువతి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భూమిరెడ్డి గిరిజ కర్నూలులో ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని కర్ణాటకలో పీజీ చదువుతోంది. శనివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన ఆమె తన ఇంట్లోని గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి రఘునాథరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

పెద్దవంక వాగులో ఆటో బోల్తా

కల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్ల గ్రామానికి సమీపంలోని పెద్దవంక వాగులో ఆటో బోల్తా పడింది. శనివా రం పర్లకు చెందిన ఆటో డ్రైవర్ మద్దిలే టి రామదాసు కర్నూలుకు బయలు దేరాడు. ఆటో పెద్దవంక వాగు బ్రిడ్జిపై నుంచి అదుపుతప్పి బోల్తాపడింది. ఆటోలో ప్యాసింజర్లు లేకపోవడం, వాగులో నీరు ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

ఆదోనిలో పట్టపగలే భారీ చోరీ

● 24 తులాల బంగారం, రూ.1.20 లక్షల అపహరణ



బీరువాను ఓపెన్ చేసి బంగారు నగలను దొంగలించిన దుండగులు

ఆదోని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో పట్టపగలే భారీ చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఒక ఇంట్లోకి చొరబడి సుమారు 24 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.20 లక్షలు నగదును అపహరించారు. వివరాలివీ.. ఆదోని పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్న ఆంజనేయులు పని నిమిత్తం భార్యతో కలిసి శనివారం పెద్దతుంబళం గ్రామానికి వెళ్లారు. ఎవరూ లేకపోవడంతో దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో ఉన్న బీరువాను పగలగొట్టి 24 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.1.20 లక్షల నగదును దొంగలించారు. అక్కడే వెండి ఆభరణాలు ఉన్నప్పటికీ వాటిని దొంగలు ముట్టుకోలేదు. దీంతో పలు అనుమానాలకు తావిస్తోందని పోలీసులు భావిస్తున్నారు. కింది ఇంట్లో దొంగలించిన తర్వాత దుండగులు అదే ఇంట్లోనిపై అంతస్తులో నివాసముంటున్న రామచంద్రగౌడ్ ఇంట్లో కూడా దొంగలు చోరీకి యత్నించారు. ఈ ప్రయత్నంలో ఐదు గ్రాముల బంగారం చోరీ జరిగినట్లు రామచంద్రగౌడ్ తెలిపారు. టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఈ దొంగతనంపై వివరాలు సేకరించేందుకు కర్నూలు నుంచి క్లూస్ టీం ఘటనా స్థలాన్ని పరిశీలించింది. వారి ఇంట్లో వేలిముద్రలను సేకరించి, దొంగల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ డా.ఏ. సిరి తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

● అర్జీల పరిష్కారానికి 1100కు ఫోన్ చేయవచ్చు.

అధికారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్. 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు Meeko-sa-m.a-p.-go-v.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని అన్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే భర్తీచేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. శనివారం నగర పాలక పారిశుధ్య కార్మికులు, ఏఐటీయూసీ కార్మిక సంఘాల అధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ధర్మపేట, ఎస్‌బీఐ కూడలి, పాతకంట్రోల్ రూం, కొండారెడ్డిబురుజు మీదుగా రాజవిహర్, మౌర్య హోటల్ నుంచి ఏఐటీయూసీ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. మునెప్ప మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు కే.కృష్ణకు ఏఐటీయూసీ అధ్వర్యంలో రూ.8వేలు ఆర్థికసాయంను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, ఏఐటీయూసీ నగర ఉప ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, నగర అధ్యక్ష,కార్యదర్శులు వెంకటేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని కోటి సంతకాలతో నిలదీద్దాం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



సంతకాలు సేకరిస్తున్న వైసీపీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పేదలకు వైద్య విద్య అం దించే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని కోటి సంతకాలతో నిలదీద్దామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక 23వ వార్డులో ఇంటింటికి వెళ్లి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఎస్వీ మాట్లాడుతూ వైసీపీ హయాంలో జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ప్రకారం శంకుస్థాపన చేపట్టి పనులు ప్రారంభించారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక వెంటనే మెడికల్ కళాశాలలన పనులు నిలిపివేసి ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టాలని సీఎం చంద్రబాబు చూడడం దారుణమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కటారి పల్లవి, నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓర్వకల్లు డిప్యూటీ ఎంపీడీవోగా శాంతయ్య

ఓర్వకల్లు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు డిప్యూటీ ఎంపీడీవో గా డి.శాంతయ్యను నియమించినట్లు కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో సుబ్బరాయుడు పదవి విరమణ పొందడంతో ఇక్కడ పోస్టు ఖాళీగా ఉన్న సందర్భంగా నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు గ్రామ పంచాయతీ సెక్రటరీ గ్రేడ్-1గా పని చేస్తున్న శాంతయ్యను పదోన్నతి కల్పిస్తూ ఓర్వకల్లు డిప్యూటీ ఎంపీడీవోగా నియమించారు. ఆయన మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉద్యమాలతోనే కార్మికుల బతుకులు

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ గఫూర్



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ. గఫూర్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 25(ఆంధ్ర జ్యోతి): బలమైన ఉద్యమాల చేయడం ద్వారానే కార్మికుల బతుకులు మారుతాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ. గఫూర్ అన్నారు. శనివారం స్థానిక కేకే భవన్‌లో సీఐటీయూ జిల్లా 13వ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి.. ముందుగా సీఐటీయూ జెండాను మెడికల్ రేప్స్ యూనియన్ నాయకలు వెంకట్ ఆవిష్కరించారు. గఫూర్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక ప్రభుత్వమని అన్నారు. పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, పి.నిర్మల, అంజిబాబు, రామాంజనేయులు, సీహెచ్.సాయిబాబ, ఉమాదేవి, తదతరులు పాల్గొన్నారు.

పీఎంఎస్‌బీవై చెక్ అందజేత



బాధితులకు చెక్ అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

కోడుమూరు రూరల్, అక్టోబరు 25, (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పులకుర్తి బ్రాంచ్ కెనరా బ్యాంకు మేనేజర్ బాధిత కుటుంబానికి పీఎంఎస్‌బీవై చెక్ అందించారు. బ్యాంకు మేనేజర్ ప్రశాంత్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన చిన్నమాదన్న అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని తెలిపారు. బ్యాంకు ఖాతా కలిగిన చిన్నమాదన్న పీఎంఎస్‌బీవై కింద రూ. 20 ప్రీమియం చెల్లించారని అన్నారు. దీంతో నామినీ అయిన భార్య, కొడుకు పేర రూ. 2లక్షలు జమ కావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌టీసీఎఫ్ఎల్ డైరెక్టర్ ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ అశోక్‌కుమార్, కౌన్సిలర్లు పులికొండ, లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలని, పెన్షన్లు, ఇంటి స్థలాలు, వృద్ధ కళాకారులకు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాలని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఆర్ భవన్‌లో ప్రజానాట్యమండలి జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే ప్రజల కోసం పనిచేసే కళాకారుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. 12న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నామన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాసులు, శివ, మాణిక్యం, నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌యూను ప్రక్షాళన చేయాలి



వైస్ చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్ , అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటిని ప్రక్షాళన చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. శరత్ డిమాండ్ చేశారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీకి వచ్చిన ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ విజయ భాస్కర్‌కు వినతి పత్రం ద్వారా విన్నవించారు. ఆయనతో మాట్లాడుతూ వర్శిటీలో నిధుల దుర్వినియోగం, అధికారుల నిర్లక్ష్యంతో ఉన్నత చదువులు అధ్వాన్నంగా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమాలపై ఎన్ని ఫిర్యాదులు చేసినా స్పందించే వారు లేక పోవడంతో వర్శిటీలో అధికారులు ఇష్టానుసారంగా దోపిడికి తెరలేపారని ఆరోపించార వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఈశ్వర్, ప్రశాంత్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దండుకున్నారు..

● తూతూ మంత్రంగా పనులు
● అభివృద్ధి పనుల్లో అక్రమాలు
● నెలరోజుల్లోనే గుంతలు పడ్డ వైనం
● పట్టించుకోని అధికారులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబర్ 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో పలు ప్రాంతాల్లో నగర పాలక సంస్థ నిధులతో చేసిన పనుల్లో నాణ్యత కొరవడింది. పనులు చేసిన కొద్ది రోజులకే తిరిగి అదే స్థితికి చేరుకుంటున్నాయి. ఇంజనీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పాటు పలువురు కమిషన్లకు కక్కుర్తి పడి ప్రజాధనాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపనలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



విష్ణుటౌన్ షిప్‌లో కంకర తేలి గుంతలు పడిన సిమెంటు రోడ్డు

రూ.100 కోట్లకు పైగా నిధులు ఖర్చు

నగరంలో కొన్ని సంవత్సరాలుగా సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలు, రహదారుల మరమ్మతులు చేపట్టారు. సుమారు రూ.100 కోట్లకు పైగానే ఖర్చుచేశారు. ఈ నిధులతో వెంకటరమణ కాలనీ, విష్ణుటౌన్‌షిప్, నరసింహరెడ్డి నగర్, పాత బస్తీ, అశోక్‌నగర్, గణేష్‌నగర్ తదితర ప్రాంతాలలో పనులు చేశారు. నాణ్యతలేని మెటీరియల్ వాడటంతో పాటు చాలా ప్రాంతాల్లో క్యూరింగ్ చేయడం కూడా లేదు. నాణ్యతను గుర్తించాల్సి క్వాలిటి కంట్రోల్ విభాగం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



నాల్గవ తరగతి ఎంప్లాయిస్ కాలనీలో సిమెంటు రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీటిని చూపుతున్న ప్రజలు

నాసిరకంగా మరమ్మతులు..

విష్ణుటౌన్ షిప్‌లో 6 అడుగుల సిమెంటు రోడ్డుకు సుమారు రూ.15 లక్షలతో మరమ్మతులు చేశారు. అయితే ఒకే ఒక వర్షానికి కంకర తేలింది. మరమ్మతులు సరిగ్గా చేయకపోవడంతోనే కంకర తేలిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాధాక్రిష్ణ థియేటర్ వద్ద సీసీ రహదారి దెబ్బతినడంతో రూ.10 లక్షలతో పనులు చేపట్టారు. పైపైన సిమెంటు పూత పూశారు. పనులు జరుగుతున్న సమయంలోనే నాణ్యత లోపించిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీలో ముందుచూపు లేని ఇంజనీర్ల నిర్వాకం వల్ల సిమెంటు రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది.

బిల్లులు చెల్లించారు..

వైసీపీ ప్రభుత్వ హయాంలో నగరంలో రెండు సార్లు రహదారులకు ప్యాచ్‌వర్కు పనుచేశారు. సుమారు రూ.5 కోట్ల వరకు నిధులు ఖర్చుపెట్టారు. ఆ పనుల్లో నాణ్యత లేనట్లు విమర్శలు వచ్చాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయిన సరే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

పర్యవేక్షణ ఎక్కడ..

నగరంలో జరిగే పనులపై నగర పాలక ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. క్షేత్రస్థాయిలో అమ్యూనిటీస్ సెక్రటరీలు, ఏఈలు,డీఈలు, ఈఈలు, ఎస్ఈ వరకు పనులను పరిశీలించాలి. రోడ్డుకు ఎంత కంకర, ఇసుక, సిమెంటు వాడుతున్నారు...మరమ్మతులకు సంబంధించి ఏ మేర వాడుతున్నారు తదితర విషయాల ను ఉన్నతాధికారులు పరిశీలించారు. ఆ దిశగా అధికారులు పర్యవేక్షించడం లేదు.

తూతూ మంత్రంగా పనులు..

కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక నగరంలో రహదారులకు మరమ్మతులు చేపట్టి జనవరిలో పూర్తి చేశారు. స్వయంగా గుంతలు పూడ్చి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని మంత్రి టీజీ భరత్ పలుమార్లు సమావేశాల్లో అధికారును ఆదేశించారు. వివిధ కాలనీల్లో గుంతలు పడిన రహదారులకు ప్యాచ్ వర్క్ పనులు చేపట్టారు. నగరంలో 756 పైగా గుంతలను పూడ్చేందుకు దాదాపు రూ.1.50 కోట్లు మంజూరు చేశారు. కొన్ని ప్రాంతాల్లో సీసీ రోడ్లపై పడిన గుంతలను కాంక్రీటుతో పూడ్చారు. వాటికి క్యూరింగ్ కూడా చేయకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యతతోనే పనులు చేపట్టాం

నాణ్యతతోనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాం. కూటమి ప్రభు త్వం వచ్చాక అన్ని రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశాం. దీంతో పాటు నిధులు కూడా మంజూరు చేశారు. అందులో భాగంగానే అన్నీ రోడ్లకు మరమ్మతులు చేపడుతాం.

● శేషసాయి, ఇన్‌చార్జి ఎస్ఈ



విష్ణుటౌన్ షిప్‌లో కంకర తేలిన సిమెంటు రోడ్డు

అనస్థీషియా ప్రాధాన్యత వెలకట్టలేనిది

● కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్



వర్క్‌షాపును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో అనస్థీషియా వైద్యుల సేవలు, ప్రాధాన్యత వెలకట్టలేనివని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ అన్నారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీ మోర్గాన్ స్కిల్ ల్యాబ్‌లో అనస్థీషియాలజీ, కర్నూలు సొసైటి ఆఫ్ అనస్థీషియాలజీ, కర్నూలు సొసైటి ఆఫ్ అనస్థీషియాలజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఫోకస్ ప్లస్ 2025ను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లుతో కలిసి ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఈ వర్క్‌షాపులో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వైద్యులు నిత్య విద్యార్థి అని, వైద్య రంగంలో నూతన ఆవిష్కరణలను ఎప్పటికప్పుడు అంది పుచ్చుకోవడం ద్వారా రోగులకు మంచి సేవలు అందుతాయన్నారు. కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వర్క్‌షాపుకు వైద్యులు, విద్యార్థులు వచ్చారని తెలిపారు. అనస్థీషియా విభాగపు హెచ్‌వోడీ డా.విశాల, వైస్ చైర్మన్, ప్రొఫెసర్ డా.రామశివనాయక్, కర్నూలు సొసైటీ ఆఫ్ అనస్థీషియా ప్రెసిడెంట్ డా.సుధీర్ కుమార్, సెక్రటరీ డా. జయదేవ్ రాథోడ్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించండి



విద్యార్థులకు సలహాలు ఇస్తున్న శివనారాయణ

ఓర్వకల్లు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ విశ్వ విద్యాలయ విద్యార్థులు రైతులకు వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలని ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వ విద్యాలయం గుంటూరు విస్తరణ సంచాలకులు డా.జి.శివనారాయణ సూచించారు. మండలంలోని నన్నూరు, లొద్దిపల్లె గ్రామాలను శనివారం ఆయన సందర్శించారు. ఆయా గ్రామాల్లో పంటల నమోదు, దిగుబడులు, వ్యవసాయ విధానం తదితర అంశాలపై శ్రీకృష్ణ దేవరాయ వ్యవసాయ కళాశాల అనంతపురం విద్యార్థులతో కలిసి ఆయన రివ్యూ నిర్వహించారు. గ్రామాల్లో రైతుల వ్యవసాయ పరిస్థితులు, సమగ్ర వ్యవసాయ పరిస్థితులు, వ్యవసాయ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఏఎన్‌జీఆర్ఏయు ఆధ్వర్యంలో వివిధ పంటల్లో మేలైన పద్ధతుల గురించి రైతులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.పి.సుజాతమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై న్యాయ విజ్ఞాన సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. శనివారం స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో జరిగిన సంక్షేమ పథకాలపై న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ వివిధ సంబంధిత శాఖలు సమన్వయం చేసుకుని అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని ఆయన కోరారు.

మహిళలకు భద్రత కల్పించాలి

కర్నూలు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): షాపింగ్ మాళ్లలో వివిధ రకాల షాపుల్లో పని చేసే మహిళలకు భద్రత కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యులు ఎం. సుధాకర్ బాబు అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ద్వారా కోరారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కుటుంబాలను వదిలి వెళ్లి చాలి, చాలని జీతాలతో దుర్భరమైన జీవితాలను సాగిస్తున్నారని వాపోయారు. కర్నూలు నగరంలో ఉండే కార్మిక శాఖ కమిషనర్ జోక్యం చేసుకుని పేద మహిళలకు న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



ఓర్వకల్లులోని ఎంఆర్‌సీ భవన్‌లో వక్తృత్వ పోటీలను తనిఖీ చేస్తున్న డీఈవో

ఓర్వకల్లు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మం డల స్థాయిలో శనివారం ఓర్వకల్లులోని ఎంఆర్‌సీ భవన్‌లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఎంఈవో ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ 26న రా జ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల్లో అవగాహన పెంచడానికి వక్తృత్వ పోటీలు చేపట్టామన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాలను పెంచుకోవాలి



క్లస్టర్ వర్సిటీ ఆధ్యాపకులు, విద్యార్థులతో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్


కర్నూలు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ విజయ భాస్కర్ అన్నారు. శనివారం క్లస్టర్ యూనివర్సిటీలో ఇంచార్జీ ఉపకులపతి వి. వెంకట బసవరావు, ప్రిన్సిపాల్ జీ శ్రీనివాస్‌తో కలిసి ఆధ్యాపకులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ విద్యా వేత్తలు, నిర్వాహకులు, ఆద్యాపకులు కలిసి సంస్థాగత అభివృద్ధి, విద్యా నైపుణ్యం, విద్యార్థి వికేంద్రీకృత సంస్కరణలను తీరును వివరించారు. వినూత్న బోధన, పరిశోధన కార్యక్రమాల ద్వారా గ్రామీణ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్లస్టర్ యూనివర్సిటీ పని చేయాలని సూచించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

కర్నూలు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలోని ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మీనాక్షిరెడ్డి కోరారు. శనివారం వర్శిటీలో ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ విజయ భాస్కర్‌ను కలిసి వినతి అందజేశారు. ఉద్యోగులందరికీ ఫైనాన్స్ కాంకరెన్స్ ఇస్తూ సీఎఫ్ఎంఎస్ ద్వారా ఉద్యోగులకు వెతనాలు చెల్లించాలని, రెగ్యులర్ పోస్టులను మంజూరు చేస్తూ అందరిని రెగ్యులరైజ్ చేయాలని, సంఘాల ముసుగులో వేతనాల ద్వారా కట్ చేయకుండా వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రంగనాథ్ గౌడ్, సాంబశివరాజు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టరేట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంటు ఎంప్లాయిస్ రాష్ట్ర సెక్రటరీ సుదర్శన్ రెడ్డి, అన్నారు. శనివారం జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్, సురేష్ రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాత్మికతతోనే ప్రశాంత జీవనం: ఎమ్మెల్యే



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కర్నూలు కల్చరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంత జీవనం సాధ్యమని, తద్వారా ప్రతి వ్యక్తికి శాంతి, సుస్థిరత చేకూరుతాయని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 30 నుంచి నవంబరు 5 వరకు నగరంలోని మాధవీనగర్‌లోని శివ రామాలయంలో నిర్వహిస్తున్న ధార్మిక సప్తాహానికి సంబంధించిన కరపత్రాలను ఆమె విడుదల చేశారు. కార్యక్రమంలో ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి జిల్లా కార్య నిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, శివరామాలయం చైర్మన్ జి. శేషాచలం, సభ్యులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో విచారణ జరపాలి

కర్నూలు అర్బన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన రూ. 2కోట్ల అవీనితి పై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్ చేశారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీకి వచ్చిన ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ విజయ భాస్కర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందీప్, ఓబులేష్, సునీల్, ప్రతాప్; అశోక్ పాల్గొన్నారు.

అమీలియో హాస్పిటల్‌లో ఇద్దరి రోగులకు ఓసీటీ స్టంట్



అత్యాధునిక స్టంట్‌అమర్చిన రోగులతో డా.లక్ష్మి ప్రసాద్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అమీలియో హాస్పిటల్‌లో ఇద్దరు రోగులకు కార్డియోలాజిస్టు డా.ప్రతాప్ రెడ్డి అత్యాధునిక ఆప్టికల్ కొహెరెన్స్ టోమోగ్రఫీ, డ్రగ్ ఎలుటింగ్ బెలూన్ ద్వారా స్టంట్ వేసి రోగుల ప్రాణాన్ని కాపాడారు. నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా చెందిన 65 ఏళ్ల షేక్ షరీఫ్, ఆళ్లగడ్డ మండలం సిరిసిల్లకు చెందిన 72 ఏళ్ల చాకలి మద్దిలేటికి గత 2023లో హార్ట్ స్ట్రోక్ రాగా లెఫ్ట్ యాంటిరియర్ డిసెండింగ్ ఆర్టరీ స్టెంట్ అమర్చారు. కానీ రోగి మందులు సరిగ్గా వాడకపోవడంతో సరిగ్గా స్టంట్ వేసిన చోట మళ్లీ రక్తనాళాలు సన్నగా మారడంతో గుండెపోటు రావడం జరిగింది. దీంతో కార్డియాలజిస్టు డా.ప్రతాప్ రెడ్డి, ఆప్టికల్ కోహెరెన్స్ టోమోగ్రఫీ (ఓసీటీ) పరీక్ష నిర్వహించి ఇమేజిగ్‌తో యాంజియోస్కల్ప్ స్కోరింగ్ బెలూన్‌తో యాంజియోప్లాస్టి చేశారు. మూసుకుపోయిన రక్తనాళాలకు అత్యాధునిక స్టంట్, వేయడంతో రోగులు త్వరగా కోలుకున్నట్లు అమీలియో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా.లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. ఈ అత్యాధునిక విధానంతో అదనపు స్టెంట్ ఇంప్లాంటేషన్ అవసరాన్ని తగ్గించడంతో పాటు ఐఎస్ఆర్ యొక్క ప్రభావవంతమైన నిర్వహణను అనుమతి ఇస్తుందన్నారు.

ప్రైవేటీకరణపై ర్యాలీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కాటసాని

కల్లూరు, అక్టోబరు 25(ఆంధ్ర జ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 28న నిర్వహించనున్న ర్యాలీని జయప్రదం చేయాలని నంద్యాల వైసీపీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తన స్వగృహంలో ఆయన వైసీపీ నాయకులు కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు వేయండి

కర్నూలు రూరల్ అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండల పరిధిలోని బసవాపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, అబ్దుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బసవాపురం గ్రామ ప్రధాన రహదారిని పరిశీలించారు. వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో గ్రామం ఉందని, 300కుటుంబాలు నివాసం ఉంటున్నారు. అయితే అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలోనైన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ప్రకాష్, హరికిషన్,రఘువరన్,వెంకటేష్, ప్రదీప్, నీలకంఠ,మురళీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి: డీఈవో



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈవో శామ్యూల్ పాల్

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి ప్రథమ స్థానంలో నిలవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు. శనివారం స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి కర్నూలు జిల్లా క్రికెట్ అండర్-14లో బాలురు, అండర్-17 బాలికల విభాగాల్లో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఈవో శామ్యూల్ పాల్ పాల్గొని విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రికెట్‌లో కర్నూలు జిల్లా జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించం వల్ల గత ఏడాది జరిగిన నీట్ ఎంబీబీఎస్‌లో స్పోర్ట్స్ కోటాలో కర్నూలు అమ్మాయికి రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ టి.కృష్ణ, సభ్యులు వెంకటేశ్వర్లు, కే.రమేష్, బీ.శేఖర్, కే.పరమేష్, హుకుం సింగ్, సురేష్ గౌడు, క్రీడాకారులు 400 మంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమం

ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి



కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. శనివారం ఆలూరు మండలం మొలగవల్లి, హత్తిబెళగల్ గ్రామాల్లో ప్రైవేట్ కళాశాలలకు వ్యతిరేకంగా రచ్చబండ నిర్వహించి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్య, రహదారుల దుస్థితిపై పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు విన్నవించామన్నారు. ఆలూరు ఎలక్షన్ పరిశీలకులు గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేంద్రరెడ్డి, మండల కన్వీనర్ మల్లికార్జున, నాయకులు అరికెర వెంకటేశ్వర్లు, చిన్న ఈరన్న, కొట్టాల రాజు, నాగేంద్ర, వీరేష్, మౌలా, నాగేష్ పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఈనెల 28వ తేదీన తలపెట్టిన ప్రజా ఉద్యమం కార్యక్రమాలను జయప్రదం చేయాలని వైసీపీ రాష్ట్ర నాయకులు శ్రీరంగడు, సోమశేఖర్, ఎంపీపీ నారాయణదాస్‌లు ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో వైసీపీ ప్రజా ఉద్యమం వాల్‌పోస్టర్లను నాయకులు విడుదల చేశారు వైఎస్సార్సీపీ నాయకులు బనగాని శ్రీను, భాస్కర్ నాయక్, దేవన్న, వెంకటేష్, కేశప్ప పాల్గొన్నారు.

వర్షంతో రైతులు విలవిల

దేవనకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వరుస వర్షాలతో పంటలు సాగు చేసిన రైతులు విలవిలాడుతున్నారు. తగ్గిపోయాయి అనుకున్న వర్షలు అల్పపీడన దోరణితో భారీ వర్షాలు కురుస్తుండటంతో పంటల దిగుబడులపై తీవ్రప్రభావం చూపుతోంది. పత్తి పంట కోతలకు కూలీల కొరతతో పత్తి తీయక అలాగే ఉండటంతో కురుస్తున్న వర్షాలకు తడిసిపోయి నెలరాలుతోంది. గురువారం తెల్లవారుజామున 3.41 మీమీ, శుక్రవారం సాయంత్రం భారీ ఉరుములు, మెరుపులతో 1.86 మీమీల వర్షం కురిసింది.

రీసర్వేకు సహకరించండి

తుగ్గలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీసర్వేకు రైతులందరూ సహకరించాలని తహసీల్దార్ రవి కోరారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలో పగిడిరాయి, మారెళ్ల, ముక్కెళ్ల తదితర గ్రామాల్లో ఇప్పటికే రీసర్వే పూర్తి చేశామని, బొందిమడుగుల్లో రీసర్వే ప్రారంభిస్తున్నామనీ, ఆ గ్రామ రైతులు ప్రతి ఒక్కరూ రీసర్వే అధికారులకు సహకరిస్తే వారి పొలాలను కొలిచి హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు వారికి ఖచ్చితమైన రికార్డులను అందిస్తామనీ అన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

దేవనకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కడపలో డిశెంబరు 6,7 న జరిగే సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ 9 వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు మునిస్వామి అన్నారు. కార్యక్రమంలో ధర్మ, రాము, మహేష్, నాగరాజు, గిడ్డయ్య ఉన్నారు.

పోటీలకు హత్తిబెళగల్ విద్యార్థుల ఎంపిక

ఆలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఈనెల 12న జరిగిన స్కూల్ గేమ్స్ సెపక్‌తక్రా ఎంపిక పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో ఆలూరు మండలం హత్తిబెళగల్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

ఆదోని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 7వ వార్డు కొనిమొహల్లా ఏరియాలో నూతన సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే పార్థసారథి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. రూ.8లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, రూ.2లక్షలతో డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేరుగా మున్సిపాలిటీలో జమ చేసే 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5.80 కోట్లు ఆదోని మున్సిపాలిటీకి విడుదలయ్యాయని తెలిపారు. ఈ నిధుల ద్వారా పట్టణంలోని సమస్యలను పరిష్కరించుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ఈ గ్రాంటును రెండు రకాలుగా విభజించి టైడ్ గ్రాంట్ కింద రూ.3.48 కోట్లు ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు. అలాగే రూ.2.32 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ కోసం ఖర్చు చేయడం జరుగుతుందని వెల్లడించారు. రాబోయే మూడు నెలల్లో ఆదోనిలోని వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగుతాయని, ఇది శుభసూచకమని తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి, వైస్ చైర్మన్ గౌస్, నరసింహులు, మున్సిపల్ ఇంజనీర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

29న కూరగాయల మార్కెట్‌కు వేలం పాట

దేవనకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కుంకనూరులో గ్రామ పంచాయతీ పరిధిలోని దినసరి కూరగాయాల మార్కెట్‌కు ఈనెల 29న వేలం పాట వేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌సింగ్ తెలిపారు. కుంకనూర గ్రామంలో అంజనేయ స్వామి దేవాలయంలో వేలం పాట ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామన్నారు. పాల్గొనే వారు దరావత్తు రూ.50 వేలు ముందుగానే చెల్లించి, పాటలో పాల్గొనాలన్నారు. అధిక ధరకు పాటపాడిన వ్యక్తి ముందుగానే నగదు చెల్లించి, గ్రామపంచాయతీకి సొంత స్థలం లేకపోవడంతో, వేలం పాటలో గెలుపొందిన వారే స్థలం నిర్ణయించుకొని మార్కెట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఘనంగా అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం



మాట్లాడుతున్న ఏపీ ప్రజా ఆత్మగౌరవ వేదిక అధ్యక్షుడు భీమ్‌రెడ్డి

ఆదోని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆదోనిలోని అనంత మంగళ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం ఏపీ ప్రజా ఆత్మగౌరవ వేదిక ఆధ్వర్యంలో రంగస్థల కళాకారులకు ఘన సన్మానం చేశారు. సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న కవి, రచయిత, కళాకారుడు డాక్టర్ నల్లారెడ్డి, కళాకారుడు వలిసాబ్, హార్మోనిస్ట్ మహేష్, ఇస్సాక్‌లను శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రజా ఆత్మగౌరవ వేదిక అధ్యక్షులు భీమ్‌రెడ్డి మాట్లాడుతూ కళాకారులు సమాజానికి ఎంతో అవసరమని, వారికి ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహకారం, ఐడెంటిటీ కార్డులు, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నాటకాల ప్రదర్శనకు కూడా ఆర్థిక సాయం అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు, ఇతర కళాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మాట్లాడుతున్న ఎంఈవో భూపాల్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు భూపాల్ రెడ్డి, శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. అక్కడ ఎంపికైన వారు రాష్ట్ర పోటీలకు పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర అసెంబ్లీ భవనంలో ముఖ్యమంత్రి మంత్రులతో బహుమతి ప్రదానం చేస్తారన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఫయాజుద్దీన్, రమేష్ నాయుడు, సునీల్, రాజ్‌కుమార్, సుధాకర్, లోక్యానాయక్ పాల్గొన్నారు.

ఆలూరు ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించాలి

● ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను కోరిన జనసేన పార్టీ ఇన్‌చార్జి వెంకప్ప

ఆలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వెనకబడిన ఆలూరు ప్రాంత అభివృద్ధి కోసం నిధులు మంజూరయ్యేలా సహకరించాలని ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్‌ను మంగళగిరిలో కలిసి విన్నవించినట్లు జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకప్ప శనివారం తెలిపారు. ఆలూరులో కూమి నేతల మధ్య సమన్వయంపై చర్చించినట్లు తెలిపారు. గతంలో జరిగిన తపలు పునరావృత్తం గాకుండా పరస్పర అనుకూలతతో కూటమిని బలోపేతం చేసే దిశలో ఎలా ముందుకు వెళ్లాలో సూచించారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి ఆలూరు సమస్యలు తీసుకెళ్తానని ఎమ్మెల్సీ చెప్పినట్లు ఆయన తెలిపారు.



ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్‌తో ఆలూరు జనసేన పార్టీ ఇన్‌చార్జి వెంకప్ప

బస్సు దుర్ఘటన బాధాకరం



బస్సు ప్రమాదంపై మౌనం పాటిస్తున్న వైసీపీ నాయకులు

మద్దికెర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామ సమీపంలో కావేరి ట్రావెల్ బస్సు అగ్ని ప్రమాదానికి గురై 19 మంది ప్రయాణీకులు మృతి చెందడం చాలా బాధాకరమని జడ్పీటీసీ సభ్యులు డి.మురళిధర్ రెడ్డి, ఉపసర్పంచ్ కవిరెడ్డి కృష్ణ, మండల వైసీపీ ఉపాధ్యక్షులు కృష్ణ యాదవ్, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు అన్నారు. శనివారం మండల కేంద్రమైన మద్దికెరలో ప్రమాదానికి గురై మృతి చెందిన వారికి ఆత్మశాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంపల వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, రామకృష్ణ, గంధం చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: కర్నూలు సమీపంలోని చిన్నటేకూరు వద్ద జరిగిన బస్సు దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతినాయుడు కోరారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా నాగరాజు

మద్దికెర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మద్దికెర ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌గా నాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపాల్ నాగరాజును యూటీఎఫ్ నాయకులు ఎంజీ నాగరాజు, విశ్వనాథ్ అభినందించారు. ప్రస్తుతం ఇన్‌చార్జిగా పని చేస్తున్న సవిత అధ్యాపకురాలిగా వెళ్లారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన నాగరాజు ప్రిన్సిపల్‌గా పూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

సీజేపై దాడికి నిరసనగా చలో హైదరాబాద్

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి పైదాడి నిరసిస్తూ నవంబర్ 1న చలో హైదరాబాద్‌కు భారీగా తరలిరావాలని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారి గిడ్డయ్య పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని మునిసిపల్ క్రీడామైదానంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. దళిత జాతి ప్రభంజనంతో నిరసనను తెలుపుదామని అన్నారు. ప్రతి గ్రామంలో నుంచి తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, మాదాసు జగన్ , కిరణ్, నరసింహులు, తిమ్మన్న, మణికంఠ, దత్తు, నకల రాజు, అనిల్ కుమార్ బసవరాజు పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై జరిగిన దాడిని నిరసిస్తూ నవంబర్ 1న తలపెట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షులు సుభాష్‌చంద్ర మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి రాముడు పిలుపునిచ్చారు. శనివారం పత్తికొండలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల కార్యకర్తల సమావేశం మనోహర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అత్యున్నత సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయిపై జరిగిన దాడి హేయమైన చర్య అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాగూర్, షైఖేల్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

'ఆ పొలాలను అమ్మినా, కొన్నా చర్యలు'

తుగ్గలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘంలో పొలాల్లో మార్టిగేజ్ లోన్లు తీసుకుని ఆ పొలంపై అప్పులను చెల్లించకుండా అమ్మినా, కొన్నా వారిపై చర్యలు తీసుకుంటామని మారెళ్ల సింగిల్ విండో అధ్యక్షులు వైపీ ప్రభాకర్ రెడ్డి, సీఈవో మనోహర్ నాయుడు తెలిపారు. శనివారం మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ సొసైటీ కార్యాలయంలో మాట్లాడుతూ సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు ప్రతి సంవత్సరం రుణాలను రెన్యువల్ చేసుకోవాలని లేకపోతే మొండి బకాయిల కింద వెళ్తాయన్నారు. సొసైటీల్లో ఎల్‌టీ లోన్లుతో పాటు వ్యవసాయ పరికరాలు కూడా అందిస్తామన్నారు. రుణాలు చెల్లించకపోతే సొసైటీల అభివృద్ధి కుంటు పడుతుందన్నారు.



సింగిల్ విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

రేషన్ డీలర్ల ప్రక్షాళనకు కసరత్తు

● పార్టీ కార్యకర్తలకు కేటాయించే యోచనలో వైకుంఠం జ్యోతి

ఆలూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి కసరత్తు ఆరంభించారు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఇంకా డీలర్లుగా కొనసాగుతున్న వారిపై దృష్టి సారించారు. అరికెర గ్రామం నుంచే గురువారం ప్రక్రియను ఆరంభించారు. మరో వైపు రేషన్ షాపులో కార్డులను బట్టి కూడా రెండు భాగాలుగా విభజించి పార్టీ కార్యకర్తలకు ఇచ్చి న్యాయం చేసేందుకు నిర్ణయించారు. మరోవైపు రెగ్యులర్ డీలర్‌షిప్‌లపై కూడా దృష్టి సారించారు. దీర్ఘకాలికంగా ఏ పార్టీ వస్తే ఆ పార్టీ వైపు ఉంటున్న కొందరు డీలర్లపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా మార్పు చేసేందుకు ఇప్పటికే అధికారులతో చర్చించారు. దీంతో గ్రామాల్లో ఇప్పుడు కొత్త డీలర్ల సందడి మొదలయ్యింది. డీలర్లు రెవెన్యూ కార్యాలయంకు పరుగులు తీస్తున్నారు. నవంబర్ 1వ తేదీ నాటికి ఈ మార్పులు పూర్తి కానున్నాయి. మరోవైపు తమను తొలగించవద్దని రెగ్యులర్ డీలర్లు అధికారులను వేడుకుంటున్నారు.

ఇక ఫీల్డ్ అసిస్టెంట్ల వంతు: గ్రామాల్లో రాజకీయాలు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లపై పూర్తి స్థాయిలో నివేదిక సిద్ధం చేశారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన వారిని మార్పు చేసి వారి స్థానంలో పార్టీకి పని చేసిన వారికి కట్టబెట్టేందుకు సిద్ధం చేస్తున్నారు. కార్యకర్తలకు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించి న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామని టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ తెలిపారు.

డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి



రామాంజనేయులను సన్మానిస్తున్న ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు

హొలహర్వి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): గూళ్యం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రామాంజనేయులకు డిప్యూటీ ఎంపీడీఓగా పదోన్నతి లభించిందని ఎంపీడీఓ వరలకి‌ తెలిపారు. శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. రెండేళ్లపాటు ఎటువంటి మచ్చ లేకుండా అంకితభావంతో పనిచేసిన రామాంజనేయులు మంత్రాలయం మండలానికి బదిలీ అయ్యారని, ఆయన పదోన్నతిపై అక్కడికి వెళ్లడం హర్షించదగ్గ విషయమన్నారు. మరిన్ని పదోన్నతులు పొందాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు

హంద్రీ కాలువలో యువకుడు గల్లంతు

చిప్పగిరి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామదుర్గం గ్రామానికి చెందిన రాజు(26) అనే యువకుడు హంద్రీ కాలువలో శుక్రవారం గల్లంతయ్యాడు. గుంతకల్ మండలం బుగ్గ సంగాల దేవాలయంలో వివాహానికి వెళ్లిన రాజు కసాపురం వద్ద కాలువలో నీరు తాగడానికి వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. తోటి మిత్రులు రాజును రక్షించడానికి ప్రయత్నించగా కాలువలో కొట్టుకుపోయాడు. వెంటనే రామదుర్గం గ్రామస్తులకు సమాచారం అందించడంతో దాదాపు 200 మంది కాలువలో రాజు జాడ కోసం గాలిస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు రాజు ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి పద్మ, బంధువులు, గ్రామస్తులు చిప్పగిరి-గుంతకల్ మధ్య హంద్రీ కాలువ వద్ద మృతదేహం కోసం కాపు కాశారు. రాజు డిగ్రీ వరకు చదువుకుని కూలీ పనులు చేసుకుంటున్నాడు. కుటుంబంలో రెండో కుమారుడైన రాజుకు అన్న, ఇద్దరు అక్కలు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



రాంపురంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

తుగ్గలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని ఏపీవో హేమసుందర్, సింగిల్ విండో డైరెక్టర్ భీమలింగప్ప చౌదరి అన్నారు. శనివారం మండల పరిధిలోని రాంపురం, రాంపురం కొట్టాల గ్రామాల మధ్య అవెన్యూ ప్లాంటేషన్ కింద రోడ్లకిరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి వదిలేయకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా మనదే అన్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించినప్పుడే పర్యావరణాన్ని కాపాడిన వారమవుతామన్నారు. మొక్కలు పెంచడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దిలేటి చౌదరి, మల్లయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఇస్మాయిల్, తదితరులు ఉన్నారు.

ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి



పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ బండారు సుహాసిని

మద్దికెర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండు వద్ద ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన పంచాయతీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కవిరెడ్డి కృష్ణ, పంచాయతీ సభ్యులు వెంకట్రాముడు, రామాంజులు మాట్లాడుతూ మద్దికెర గ్రామంలో దాదాపు 25వేల జనాభా నివసిస్తుందని ప్రధాన బస్టాండు వద్ద ఎలాంటి మరుగుదొడ్లు లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మద్దికెర బస్టాండు నుంచి హైదరాబాదు, కర్నూలు పట్టణానికి ఎక్కువ శాతం ప్రజలు వెళ్తున్నారనీ, మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ అన్నారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని, పంచాయతీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూస్తామన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ సభ్యులు ఎస్.లక్ష్మినారాయణ, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, చంద్రశేఖర్‌గౌడు, కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

పొలం పనులకు కూలీలు కరువు

● వలసలతో ఖాళీ అవుతున్న గ్రామాలు ● పొంచి ఉన్న తుఫాన్ ముప్పు ● పత్తి, మిరప, వేరుశనగ రైతులు విలవిల



గోనెగండ్ల నుంచి వలస వెళ్తున్న కూలీలు

గోనెగండ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో కూలీలు వలస బాట పట్టారు. ఇక పత్తి, వేరుశనగ, మిరప, పంట పొలాలలో పనులు చేసేందుకు కూలీలు దొరక్క పోవడంతో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోరుచుట్టు మీద రోకలి పోటు అన్నట్లు గత వారం రోజులుగా వర్షాలకు కురుస్తుండటంతో పొలాలలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీనికి తోడు తుఫాన్ రానున్నట్లు వాతవరణ శాఖ ప్రకటించడంతో రైతులు కుదేలవుతున్నారు. చేతికి వచ్చిన పత్తి పంట ఎక్కడ పోతుందోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన సమయానికి కూలీలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి గత 15 రోజులుగా వలస బండ్లు కదులుతున్నాయి. గంజహళ్లి, గోనెగండ్ల, ఐరన్‌బండ, వేముగోడు, అగ్రహారం, బైలుప్పల, పెద్దనేలటూరు, చిన్నమరివీడు, పెద్దమరివీడు, అలువాల, గ్రామాల నుంచి హైదరాబాద్, ముంబై, గుంటూరు, రంగారెడ్డి, రాజంపేట, గుంటూరు, కడప, ఒంగోలు ప్రాంత్రాలకు కూలీలు వలసలు వెలుతున్నారు. దాదాపు ఇప్పటి దాకా 5వేల నుంచి 7వేల మంది వలసల వెళ్లినట్లు సమాచారం. రాజంపేట, కడప, కర్ణాటక ప్రాంతాల్లో పత్తి పొలాల్లో పనులు చేసేందుకు వెళ్లారు. మరికొందరు హైదరాబాద్, ముంబై పట్టణాల్లో సిమెంట్, గృహ నిర్మాణ పనులకు కూలీలుగా పనిచేసేందుకు వెళ్తున్నట్లు వలస కూలీలు చెబుతున్నారు. స్థానికంగా పంట పొలాల్లో పనులు ఉన్నప్పటికీ కూలీ గిట్టు బాటు కావడం లేదని కూలీలు తెలుపుతున్నారు.

కూలీలు దొరక్క రైతుల ఇబ్బందులు

గ్రామాల్లో చాల మంది కూలీలు వలస బాట పట్టడంతో స్థానిక



కూలీలు లేకపోవడంతో పత్తిని పొలంలోనే వదిలేసిన దృశ్యం

పొలం పనుల్లో పనులు చేసేందుకు కూలీలు దొరకడం లేదు. దీంతో మిరప, పత్తి, వేరుశనగ పంటలను సాగు చేసిన రైతులు కూలీలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. చాలా గ్రామాల్లో పొలం ను సాగు చేసిన రైతులే పొలం పనులను చేసుకుంటున్నారు. మిరప, పత్తి పంటలను కోసేందుకు కూలీలు అవసరం ఎంతో ఉంది. అయినప్పటికీ కూలీలు లేక పోవడంతో పంటలు సాగు చేసిన రైతుల ఇక్కట్లు అంతా ఇంతా కాదు.

ఇతర ప్రాంతాల్లో కూలి ఎక్కువగా ఇస్తుండడంతో..

గోనెగండ్ల మండలంలో ఈ ఏడాది పత్తి, వేరుశనగ, మిరప అధికంగా సాగు చేశారు. పత్తి 10వేలు, వేరుశనగ 5వేలు, మిరప 7వేల ఎరకాల్లో సాగు చేశారు. అయితే పండిన పంటను విరిసేందుకు కూలీలు దొరకడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీంతో పత్తి పొలాల్లో పత్తి చెట్లపై పత్తి అలాగే ఉంది. తెలంగాణలో కేజీ పత్తి తీస్తే రూ. 15 ఇస్తున్నారని వలస కూలీలు చెబుతున్నారు. ఇక్కడ కేజీకి రూ. 12 నుంచి రూ. 13 మాత్రమే ఇస్తున్నారని, అందువల్ల ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నట్లు కూలీలు చెబుతున్నారు.

శ్రీమఠానికి బియ్యం, వెండి విరాళం



విరాళం ఇచ్చిన బియ్యం బస్తాల వద్ద దాతలతో పీఠాధిపతి

మంత్రాలయం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ముంబైకి చెందిన అశోక్ భట్ అనే భక్తుడు 10.50 క్వింటాళ్ల బియ్యం, 500 గ్రాముల వెండి వస్తువులు, రూపశెట్టి అనేభక్తురాలు 2.50 క్వింటాళ్ల బియ్యం విరాళంగా ఇచ్చినట్లు మఠం అధికారులు తెలిపారు. ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ మాట్లాడుతూ భక్తులు శనివారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని 70 బస్తాల్లోని 13 క్వింటాళ్ల మేలురకమైన సోనాబియ్యం, వెండి పూజవస్తువులను విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఐపీ నరసింహమూర్తి, అనంతపురాణిక్, రవికులకర్ణి, నారాయణ రావు, నరసింహ దేశాయ్, శ్రీపాధ ఆచార్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ ఎర్రన్న

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆటో డ్రైవర్‌లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల దగ్గర గల ఆటో స్టాండ్ దగ్గర ఉన్న ఆటో డ్రైవర్‌లకు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రజలకు అంతరాయం కలగకుండా చూడాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు ఎల్లప్పుడు తమ దగ్గరే ఉంచుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ ఎర్రన్న సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నవాజ్ పాల్గొన్నారు.

మాటల ముఖ్యమంత్రి చంద్రబాబు: వైసీపీ

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాటల ముఖ్యమంత్రి అని మాజీ ఎంపీ, ఎమ్మిగనూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుక అన్నారు. మండలంలోని కొటేకల్లు, దేవిబెట్ట గ్రామాల్లో శనివారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని సీఎం చంద్రబాబు చేస్తున్న ఆలోచన సమంజసం కాదని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ కేశన్న, బసిరెడ్డి, లక్ష్మన్న, దేవిబెట్ట నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం ప్రజా ఆరోగ్యానికి ప్రమాదకరం అని మాజీ ఎంపీపీ, వైసీపీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాజీ మన్సూర్, జిల్లా వైసీపీ యూత్ నాయకుడు ఇమ్రాన్ అన్నారు. శనివారం ఈ నెల 28న చేపట్టనున్న ప్రజా ఉద్యమం పోస్టరును గోనెగండ్లలోని వైసీపీ కార్యాలయం దగ్గర విడుదల చేశారు. అల్లబాకాష్, చికెన్ రాజా, మల్లికార్జున రెడ్డి, నాగిరెడ్డి, జైపాల్‌రెడ్డి, బందేనవాజ్, గంగాధర్, ఖాజా పటేల్, కల్లపారి రఘు, వీరేష్, బసప్ప, వాసు పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలపై అవగాహన ఉండాలి

కోసిగి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలకు కల్పిస్తున్న సేవలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని కోసిగిలోని సచివాలయం-4 పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ సూచించారు. మోడల్ స్కూల్ పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థులు అవగాహన పెంచుకొని తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు.

జాబ్‌కార్డుకు ఈకేవైసీ తప్పనిసరి

కోసిగి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డులకు ఈకేవైసీ రెండు రోజుల సమయం మాత్రమే ఉందని, తప్పనిసరిగా చేసుకోవాలని ఏపీవో కాశిక్ తెలిపారు. శనివారం కోసిగిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో 24,675 మంది ఉపాధి హామీ కూలీలు ఉండగా.. ఇప్పటి వరకు 11,653 మంది మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నట్లు తెలిపారు. ఈకేవైసీ చేయించని జాబ్‌కార్డులు రద్దవుతాయని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

మంత్రాలయం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో మాధవరం, సూగూరు, కేజీబీవీ చిలకలడోణ, వగరూరు, ఏపీ మోడల్ స్కూల్ రచ్చుమర్రి, ఎస్ఎంకేవీ ప్రభుత్వ పాఠశాల, మంత్రాలయంలో చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు ఎంఈవోలు షైనుద్దీన్, రాగన్న, హెచ్ఎంలు గోట్ల చంద్రశేఖర్. లచ్చప్ప, నీలకంఠస్వామి తెలిపారు. శనివారం ఆయా పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన పోటీల్లో వ్యాసరచనలో మంత్రాలయానికి చెందిన పవిత్ర ప్రథమస్థానం, కావ్య తృతీయస్థానం, మాధవరానికి చెందిన నవీన్‌కుమార్ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. వక్తృత్వ పోటీల్లో మాధవరానికి చెందిన వర్షితరెడ్డి ప్రథమ స్థానం, శిల్ప తృతీయస్థానం, మంత్రాలయానికి చెందిన బీజే సువర్ణ ద్వితీయ స్థానంలో నిలిచారు. క్విజ్ పోటీల్లో రచ్చుమర్రి ఏపీ మోడల్‌స్కూల్‌కు చెందిన గ్రూపు శ్రీకర్, నవీన్‌గౌడు, సుశాంత్‌ఆచార్ ప్రథమస్థానం, మంత్రాలయానికి చెందిన కావ్య, లలిత, ధనుశ్రీ ద్వితీయ స్థానంలో ఎంపికైనట్లు తెలిపారు. నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఉమామహేశ్వరి, వరలక్ష్మి, వీణాకుమారి, రామచంద్రగౌడు, వీరన్న, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను ఉపాధ్యాయులు వెలికి తీయాలని వారి నైపుణ్యమును గుర్తించాలని ఎంఈవో-1 రామాంజనేయులు అన్నారు.మండల కేంద్రమైన కౌతాళం కన్నడ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. మండల స్థాయిలో నదిచాగి ఉన్నత పాఠశాలకు చెందిన మమత, కౌతాళం ఉన్నత పాఠశాలకు చెందిన దస్తగిరమ్మ అనే 10వ తరగతి విద్యార్థినులు, ఉరకుంద ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని అఖిల మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినులకు ఆయా పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన వైసీపీ



మాట్లాడుతున్న సురేశ్ నాయుడు

కౌతాళం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో కల్తీ మద్యం విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని టీడీపీ మండల అధ్యక్షుడు సురేశ్ నాయుడు అన్నారు. కౌతాళంలో శనివారం పార్టీ నాయకులతో కలిసి మద్యం దుకాణాల వద్ద మద్యం ప్రియులతో ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వార స్కానింగ్ చేసి అవగాహన కల్పించారు. సురేశ్ నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నాణ్యమైన కంపెనీ బ్రాండ్‌లను సరఫరా చేస్తూ క్యూఆర్‌కోడ్‌లతో స్కానింగ్ చేస్తూ ఏ దుకాణంలో మద్యం తీసుకున్న దాని పూర్తి చిరునామా స్కానింగ్‌లో చూపిస్తుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న మద్యం 13 రకాల ఫోరెన్సిక్ ల్యాబ్‌ల ద్వార నాణ్యమైనవిగా గుర్తింపు పొందాయని తెలిపారు. ప్రస్తుతం డిజిటల్ లావాదేవిల ద్వార మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, వైసీపీ హయంలో డిజిటల్ లావాదేవిలు లేక వచ్చిన సొమ్ముతో జగన్ ప్యాలెస్‌కు తరలించారని ఆరోపించారు. కార్యక్రమంలో కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు వెంకటపతిరాజు, టీడీపీ నాయకులు అడివప్పగౌడ్, కురువ వీరేష్, రామలింగ, రాజానందు వివిధ గ్రామాల నాయకులు ఉన్నారు.

నగల దుకాణంలో 4 కేజీల వెండి అపహరణ

మంత్రాలయం, అక్టోబరు 25 ఆంధ్రజ్యోతి): తుంగభద్ర గ్రామంలో భీమా శ్రీ కామాక్షి బంగారు నగల దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలివీ.. నారాయణపురం గ్రామానికి చెందిన రవికుమార్ ఐదేళ్లుగా నగల దుకాణం నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి దుకాణానికి తాళంవేసి వెళ్లారు. గుర్తు తెలియని నల్గురు వ్యక్తులు షెట్టర్, తాళం పగులగొట్టి షాపులో ఉన్న 4 కేజీల వెండివస్తువులను అపహరించుకుని వెళ్లారు. శనివారం షాపు దగ్గరికి వచ్చిన రవికుమార్ గమనించి మాధవరం పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. క్లూస్‌టీం ఏఎస్ఐ వెంకట చలపతి బృందం ద్వారా వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు. బాధితుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బస్సు ప్రమాదం బాధాకరం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నందవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు వద్ద జరిగిన రోడ్డ ప్రమాదం బాధకరమని బీజేపీ నాయుడు గురురాజారావు అన్నారు. శనివారం నందవరంలో బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆ విషాధ ఘటన తలచుకుంటేనే ప్రతి ఒక్కరిని కలచివేసే ఘటన అని అన్నారు. ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చిక్సితను అందించాలని వైద్య యంత్రాంగాన్ని కోరారు. మాజీ సర్పంచ్ రామన్నగౌడు, శివ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు దగ్గర జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన కుటంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు, జయన్న ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు అనీఫ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రమాదంలో మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.50 లక్షల ఆర్థిక సాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారికి ప్రభుత్వమే చికిత్స అందించాలని కోరారు.

గుంతలో పడ్డ బస్సు



పెద్దనేలటూరు గ్రామ శివారులో గుంతలో పడ్డ బస్సు

గోనెగండ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనేలటూరు గ్రామ శివారులో శనివారం సాయంత్రం ఆర్టీసీ విద్యార్థి బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడబోయి ఒక సైడ్‌కు ఒరిగింది. గోనెగండ్ల మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థుల కోసం ఎమ్మిగనూరుకు చెందిన ఏపీ 21జెడ్ 0445 అనే బస్సును ఆర్‌టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం మోడల్ స్కూల్ నుంచి హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు విద్యార్థులను బస్సులో ఎక్కించుకొని గ్రామాలకు బయలుదేరింది. ఆ బస్సులో హెచ్ కైరవాడి, గోనెగండ్లకు వచ్చేందుకు పెద్దనేలటూరు చెందిన బోయ లక్ష్మీదేవమ్మ, మహిళా కానిస్టేబుల్, కోడుమూరు కు చెందిన ఒక ఫొటో గ్రాఫర్ ఎక్కారు. గ్రామ శివార్లు దాటగానే బస్సుకు ఎదురుగా వచ్చిన ఎద్దు బండిని తప్పించేందుకు డ్రైవర్ రాకేష్(కాంట్రాక్ట్ బేసిక్ డ్రైవర్) బస్సును రోడ్డు పక్కకు దించాడు. అక్కడ వర్షం బురద ఉండటంతో బస్సు అదుపుతప్పి గుంతలో పడబోయింది. అక్కడ విద్యుత్ స్తంభం ఉండటంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న బోయ లక్ష్మీదేవమ్మ కుడికాలుపై స్టెప్నీ టైర్ పడింది. ఆమె కాలు విరిగింది. చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలంను చేరుకొని విచారణ చేస్తున్నారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని ఎమ్మిగనూరు ఆర్టీసీ డీఎం మద్దిలేటినాయుడు తెలిపారు.

సకాలంలో సాగునీరు అందించాలి: సీపీఎం

మంత్రాలయం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో సాగునీటి ప్రాజెక్టులకు మరమ్మతులు చేసి రైతులకు సకాలంలో సాగునీరు అందించాలని సీపీఎం నాయకులు తిక్కన్న, జయరాజు కోరారు. శనివారం రాంపురంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని ఆయన నివాసంలో కలిసి మంత్రాలయం నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించారు. సోమవారం పెద్దకడబూరులో జరిగే సీపీఎం సదస్సు కరపత్రాన్ని అందజేశారు. అలాగే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మంచాల సింగిల్‌విండో అధ్యక్షుడు రామకృష్ణారెడ్డిని కలిసి గ్రామాల్లో తాగునీరు, సాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, విద్య వైద్యం వంటి కనీస సౌకర్యాలు కల్పించేలా చూడాలని కోరారు. మాధవరం, దిబ్బనదొడ్డి, పులికనుమ ప్రాజెక్టులకు మరమ్మతులు చేయాలని కోరారు. వేర్వేరు కార్యక్రమాల్లో వైసీపీ మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్ఎం గోపాల్‌రెడ్డి, కేవీపీఎస్ నాయకులు అంజి పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో అధికారులు

మంత్రాలయం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ అశోక్‌కుమార్, జిల్లా ఆడిట్ అధికారి రమేష్‌బాబు శనివారం దర్శించుకున్నారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, ఐపీ నరసింహమూర్తి, అనంతపురాణిక్, డానియేల్, మల్లికార్జునరెడ్డి, అసిస్టెంట్ ఆడిట్ అధికారి నరసప్ప, హరిణి, సరస్వతి, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, రంగస్వామి పాల్గొన్నారు.

● మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం తమిళనాడు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ న్యాయాధికారి స్వామినాథన్ కుటుంబ సమేతంగా శనివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం అందజేశారు. వీరి వెంట ఆర్ఐ జనార్దన్‌రావు, అంజనేయులు, సూపరింటెండెంట్ అనంతపురాణిక్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్,సీనియర్ అసిస్టెంటు జయరామి రెడ్డి, వీఆర్వోలు భీమన్న గౌడు, భీముడు, రంగస్వామి, నరసప్ప ఉన్నారు.

జాతీయ స్థాయి పరుగు పోటీలకు ఎంపిక



నరసింహులును అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఎమ్మిగనూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న బోయ నరసింహులు ఇటీవల వేలూరులో జరిగిన రాష్ట్రస్థాయి పరుగు పందెంలో మూడు బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన విద్యార్థి నరసింహులును ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 800, 1500, 4/400 రిలే పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచి మూడు బంగారు పతకాలు సాధించాడని చెప్పారు. నవంబరులో హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అధ్యాపకులు లుక్మన్, రంగస్వామి, యల్లప్ప, రాజశేఖర్, లక్ష్మన్న, రంగనాయక్, విద్యార్థి తల్లిదండ్రులు రాగయ్య, జయమ్మ పాల్గొన్నారు.

వెంకటేశ్ మృతి టీడీపీకి తీరని లోటు

గోనెగండ్ల, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ అలువాల గ్రామ నాయకుడు కురువ వెంకటేష్(60) మృతి టీడీపీకి తీరని లోటు అని ఆ పార్టీ మండల కన్వీనర్ తిరుపయ్యనాయుడు, హెచ్ కైరవాడి సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, గ్రామ సర్పంచ్ బాషా అన్నారు. శనివారం ఉదయం వెంకటేష్ మృతదేహానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజేష్, మల్లేశ్ నాయుడు, నూర, ఖాశీంసాహెబ్, లడ్డు, రమేష్‌నాయుడు, రఫీక్, గోపాల్, రవి, నజీర్, చాంద్‌బాషా, అనుమంతు, రాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు

నందవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించకుండా పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పుల్లయ్య హెచ్చరించారు. శనివారం సోమలగూడూరులోని 4వ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి స్టాక్ పాయింట్లతో పాటు రికార్డులను పరిశీంచారు. అలాగే నాగలదిన్నె సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు.

'రేషన్ బియ్యం విక్రయిస్తే సస్పెండ్'

నందవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): డీలర్లు బియ్యం బయటకు అమ్మి పట్టుబడితే ఆ డీలర్‌ను సస్పెండ్ చేస్తామని తహసీల్దారు శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం సాయంత్రం డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ ప్రతి ఒక్క లబ్ధిదారునికి రేషన్ తప్పనిసరిగా వేయాలని, వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటికి వెళ్లి సరుకులు ఇవ్వాలని ఆదేశించారు. కొత్తరేషన్ కార్డులను పంపిణీ చేయడంలో జాప్యం చేయవద్దని సూచించారు.

గుంతల రోడ్లు.. వాహనదారుల అవస్థలు



కోసిగిలో ప్రధాన రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు

కోసిగి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని ఆదోని రోడ్డులో మేజర్ పంచాయతీ కార్యాలయం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు ప్రధాన రోడ్డు గుంతలు పడటంతో నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో పని చేసిన కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా ప్యాచ్ వర్కులు పనులు చేపట్టడంతో గుంతలు పడి ప్రమాదకరంగా తయారైంది . నిత్యం వాహనదారులు ఆ గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు ఆ గుంతలను పూడ్చి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.